క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న గద్దే బాబూరావు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఏటా మానవీయత సంస్థ పట్టణంలో మూడు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల గుర్తింపు



ఆక్రమణలను గుర్తిస్తున్న అధికారులు

వేపాడ: మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు అందడంతో సంబంధిత భూములను తహసీల్దార్ రాములమ్మ, రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. సర్వే నంబర్ 178/3లో సుమారు 6.91సెంట్ల ప్రభుత్వ భూమిలో మూడు అక్రమ నిర్మాణాలను, అలాగే బేతాళ బందను పూడ్చివేసినట్లు గుర్తించారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తహసీల్దార్ చెప్పారు. బేతాళ బంద ఆక్రమణపై ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించి, ఆక్రమణలను తొలగించేలా చూస్తామన్నారు. మండల సర్వేయర్ గంగాధర్, సచివాలయ సర్వేయర్ సాయి, ఆర్ఐ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గజపతినగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో 12 కేసుల్లో సీజ్ చేసిన 553 మద్యం సీసాలను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ.ఎస్.దొర సమక్షంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ధ్వంసం చేశారు. ఎస్ఐ కె.లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆతవ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

వేపాడ: ఆతవ గ్రామ బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, ఎంపీపీ సత్యవంతుడు గురువారం పరిశీలించారు. ఈరోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.28 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసింది. వైఎస్సార్‌సీపీ హయాంలోనే పనులు ప్రారంభమై, ఎన్నికల తర్వాత నిలిచిపోయాయి. రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతూ గతనెలలో సీఐటీయూ నాయకుడు జగన్ నేతృత్వంలో గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామస్తులకు వైఎస్సార్‌సీపీ నాయకులు, పలు సంఘాలు మద్దతుగా నిలిచా యి. ఎమ్మెల్సీ రఘురాజు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్‌తో ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేసేలా చొరవ చూపారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులు పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్సీని సీఐటీయూ నాయకుడు జగన్, ఆతవ సర్పంచ్ వేమన నాయుడు, గ్రామపెద్దలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి వారికే...
రాయితీ పరికరాలు..!

- వ్యవసాయ యంత్ర పరికరాల మంజూరులో వివక్ష
- కూటమి నాయకులు చెప్పిన వారికే పరికరాలు అందిస్తున్న అధికారులు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతులు



గొట్లాంలో రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన యంత్ర పరికరాలు

బొండపల్లి: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో...కూలీల ఖర్చుతగ్గించి, పెట్టుబడి, సమయం ఆదా చేసేలా సాగులో యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇస్తూ ఎప్పటి నుంచో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రపరికరాల పంపిణీ చేస్తున్నాయి. జాతీయ ఆహార భద్రత పథకం(ఎఫ్ఎన్ఎస్) కింద పారదర్శకంగా అర్హులైన రైతులను ఎంపిక చేసి వారికి వివిధ రకాల వ్యవసాయ పరికరాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వంలో పారదర్శకత అనే పదం ఎక్కడా వినబడడం లేదు. రైతుల విషయంలోనూ ప్రభుత్వం వివక్ష చూపిస్తోంది. కూటమి సానుభూతి పరులే రైతులు అన్న చందంగా వ్యవహరిస్తూ వారికే వ్యవసాయ పరికరాలు అందిస్తున్నారు. పరికరాల కోసం రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాల్సిన అధికార యంత్రాంగం ఆ పనిని జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు, నాయకులకు వదిలేసిందని రైతులు మండిప డుతున్నారు. ఈ పథకం కేవలం కూటమి సానుభూతిపరుల కోసమే అన్నరీతిగా ప్రభుత్వం అమలు చేస్తోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ పథకం అమలులో కూడా ప్రభుత్వం రైతులను పార్టీల వారీగా చూస్తోంది. రాయితీ పరికరాలకు జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో 1,658 మంది రైతులను గుర్తించారు. వారికి రూ.2.52 కోట్ల విలువైన వివిధ రకాల యంత్ర పరికరాలను మంజూరు చేశారు. గజపతినగరం నియోజకవర్గానికి 170 బ్యాటరీ పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ దుక్కు యంత్రాలు 135, పవర్ వీడర్లు 10 మంజూరయ్యాయి. వీటి పంపిణీని ఈనెల 22న జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బొండపల్లి మండలంలోని గొట్లాంలో ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా జిరాయితీ భూములు సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులతో పాటు, డీపట్టా, పోడు భూములను సాగు చేస్తున్న రైతులు దాదాపు లక్ష మందికి పైగానే ఉన్నప్పటికీ 1,658 మంది రైతులకు పరికరాలు ఇచ్చేందుకు గుర్తించారు.

పెట్టుబడి సాయం లేదు..బీమా ఎగ్గొట్టారు

కూటమి అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు సాగు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఠంచన్‌గా రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం అందేది. రైతు భరోసా పథకానికి కూటమి సర్కారు అన్నదాత సుఖీభవగా పేరు మార్చిందే తప్ప ఇంతవరకు ఏ రైతుకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఉచిత పంటల బీమా పథకం అమలయ్యేది. కూటమి సర్కారు ఆ పథకాన్ని పూర్తిగా ఎత్తేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన పది నెలల తర్వాత రైతుల కోసం ఏదైనా పథకం అమలు చేశారా అంటే అది రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడమే.అందులోనూ వివక్ష చూపడంపై రైతన్నలు

గత ప్రభుత్వంలో ఇలా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు యంత్రపరికాల మంజూరు పారదర్శకంగా జరిగింది.ప్రతీ రైతుభరోసా కేంద్రం పరిధిలో ఒక్కో కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. అయిదుగురు రైతులను ఒక బృందంగా ఏర్పాటు చేసి 50 శాతం రాయితీపై రూ.15 లక్షల విలువైన పరికరాలు అందించారు. ఈ పరికరా లను ఆ బృందంలోని సభ్యులు వాడుకోవడంతో పాటు ఆయా గ్రామాల్లోని తోటి రైతులకు వ్యవసాయశాఖ నిర్దేశించిన మొత్తానికి అద్దెకు ఇచ్చేవారు. దీంతో రైతులందరికీ ప్రయోజనం కలిగేది. అలాగే ఈయంత్ర పరికరాలతో సంబంధం లేకుండా రైతులందరికీ రూ.13,500 రైతు భరోసా పథకం కింద సాగు పెట్టుబడి సాయం అందించేవారు. ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతులందరికీ పథకం వర్తింప చేశారు.

అధికార పార్టీ వారే రైతులా..?



గజపతినగరం నియోజకవర్గంలో వేలాది మంది రైతులు ఉన్నారు. అర్హులకు పారదర్శకంగా రాయితీపై యంత్ర పరికరాలు అందించాల్సిన అధికారులు వివక్ష చూపిస్తున్నారు. కూటమి నాయకులు చెప్పిన వారికే పరికరాలు ఇస్తున్నారు. పాలకులు, అధికారులకు కూటమి సానుభూతిపరులే రైతుల్లా కనిపిస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరి అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేయాలి.

– తాళ్లపూడి అప్పలనాయుడు
రోళ్లవాక గ్రామం రైతు,బొండపల్లి మండలం

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

వ్యవసాయ యంత్ర పరికరాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలను అందించేందుకు కృషి చేస్తున్నాం.

– కె.మహరాజన్, ఏడీఏ, గజపతినగరం

పేదలను చంద్రబాబు ఏడిపిస్తున్నారు...



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతం, శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: తనకెంతో అనుభవం ఉందని, సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చకపోగా పేదలను ఏడిపిస్తు న్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2024 మార్చిలో ఎన్నికల కోడ్ రాక ముందే చీపురుపల్లి మండలంలో 234 మంది అర్హులైన వితంతవులు, వృద్ధులు పింఛన్ల కోసం ఆన్‌లైన్ చేసుకున్నారని చెప్పారు. వారందరి అర్హతల పరిశీలన పూర్తయిన ప్పటికీ ఇంకా పింఛన్లు మంజూరు కాలేదన్నారు. ఏడాదిగా వారంతా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ ప్రభుత్వం కనికరించడం లేదని మండిపడ్డారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారని గుర్తు చేశారు. అలాగే ఉపాధి హామీ వేతనదారులకు దాదాపు వంద రోజుల వేతనాలు అంద లేద ని, దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని అన్నారు. ఉపాధిహామీ పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ఇలా వంద రోజుల వేతనాలు అందకపోవడం గతంలో ఎన్నడూ లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం వేతనదారులకు వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్ల మంజూరుతో పాటు ఉపాధి వేతనాలు విడుదల చేయక పోతే తమ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పేదల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.పార్టీ నాయకులు గవిడి సురేష్, రేవల్ల సత్తిబాబు, తమ్మిన కృష్ణారావు, జనార్ధన, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక



డీఆర్పీ చెబుతున్న ఆడిట్ వివరాలను వింటున్న ఏపీడీ రమామణి, ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

వేపాడ: మండలంలోని 29 పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల కు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీలు ఇదివరకే పూర్తయ్యాయి. సోషల్ ఆడిట్ నివేదికలపై స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో ఏపీడీ కె.రమామణి ఆధ్వర్యంలో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్పీలు సభలో నివేదికలు చదివి వినిపించారు. సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ ఎస్.లక్ష్మణ రావు మాట్లాడుతూ ఉపాధి, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి 1250 పనులను రూ.20.11 కోట్లతో చేపట్టినట్లు చెప్పారు. పనులకు హాజరు కాని వారికి వేతనాలు చెల్లించడం, మొక్కల సంరక్షణ, తదితర పనుల్లో రూ.55 లక్షలు తేడా గుర్తించినట్లు తెలిపారు. వేతనదారుల మస్టర్లలో లోపాలకు సంబంధించిన విషయంలో రూ. 27,572 రికవరీకి ఏపీడీ ఆదేశించారు.అలాగే వేతనదారులకు వందరోజులు పనికల్పించలేకపోయిన, ఫీల్డ్ అసిస్టెంట్లకు సుమారు రూ.22 వేలు ఫైన్ వేశారు. ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, వేపాడ సర్పంచ్ అర్జునమ్మ, ఎంపీటీసీ గాడి గంగతల్లి, ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ, ఏపీఓ ఆదిలక్ష్మి, పీఆర్ ఏఈ ఆలీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్పెంటర్స్ డే



వేడుకలకు అతిథిగా హాజరైన ఎస్ఐ లక్ష్మణరావు

గజపతినగరం: మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్ర స్వామి కార్పెంట్ వర్క ర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్పెంటర్స్‌డేను గురువారం ఘనంగా నిర్వహించారు.వేడుకలకు ఎస్ఐ కె.లక్ష్మణరావు అతిథిగా హాజరయ్యా రు. కార్పెంటర్స్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ ప్రారంభించారు. అనంతరం కార్పెంటర్లు ర్యాలీ చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి కార్పెంట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ అండ్లూరు గణేష్, ఉపాధ్యక్షుడు ఆరికతోట జగదీష్, మండల అధ్యక్షుడు బి.వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆ కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలి

గజపతినగరం: మండల కేంద్రంలోని బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న 30 కుటుంబాలకు చెందిన పాకలు, షాపులను అధికారులు జేసీబీలతో ధ్వంసం చేయడం చాలా అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిపురం అప్పారావు అన్నారు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, నిబంధనలు పాటించకుండా పాకలు, షాపులను తొలగించడం దారుణమని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లగా ఇక్కడ కులవృత్తులు చేసుకొని జీవనం సాగిస్తున్న వారిని ఒక్కసారిగా నిర్వాసితులను చేయడం తగదని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గజపతినగరంలోని వినాయకుడి గుడి వద్ద,మెంటాడ జంక్షన్ రోడ్డు వైపు లేని ఆంక్షలు ఇక్కడే ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించినట్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణాలకు గ్రామాల్లో మూడుసెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని, ఈ 30 కుటుంబాల వారికి కూడా స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం: జిన్నాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని బొబ్బిలి డివిజన్ విద్యుత్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఏ.అనంతరావు గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో జిన్నాం, ముచ్చర్ల, ఎం.కొత్తవలస, రంగుపురం, రామన్నపేట, లోగిశ, లింగాలవలస, తుమికాపల్లి, కెంగువ, మల్లునాయుడుపేట, కొండపేట, వేమలి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్‌ల ఎన్నిక



బొండపల్లి: గరుడుబిల్లి ఉప సర్పంచ్ కొండమ్మకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి అప్పలనాయుడు



బొండపల్లి: గొట్లాంలో ఉపసర్పంచ్ గోవింద్‌ను సన్మానిస్తున్న నాయకులు



గుర్ల: తెట్టంగి ఉప సర్పంచ్ గురమ్మకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి అన్నపూర్ణాదేవి



మెరకముడిదాం: శ్యామాయవలస ఉపసర్పంచ్ శ్రీదేవికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి సుదర్శన్‌పట్నాయక్

- అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే విజయం

బొండపల్లి: మండలంలో మూడు పంచాయతీల ఉపసర్పంచ్ పదవులకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు ఉపసర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గొట్లాం పంచాయతీలో 7వ వార్డు మెంబర్ కడగల గోవింద్, గరుడు బిల్లి పంచాయతీలో 7వవార్డు మెంబర్ లెంక కొండమ్మ, వేంద్రాం పంచాయతీలో 5వ వార్డు మెంబర్ లెంక సుధ ఉపసర్పంచ్‌లుగా ఎన్నికైనట్లు రిట ర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఉపసర్పంచ్‌లుగా ఎన్నికైన వారికి ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు,నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

తెట్టంగి ఉప సర్పంచ్‌గా గురమ్మ

గుర్ల: మండలంలోని తెట్టంగి ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు జమ్ము గురమ్మ ఎన్నికయ్యారు. ఈపంచాయతీలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన వార్డు మెంబర్లు అయిదుగురు ఉండగా టీడీపీ మద్దతు దారులైన వార్డు మెంబర్లు కూడా అయిదుగురున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుగా జమ్ము గురమ్మ, టీడీపీ మద్దతు దారుగా జి.నర్సింహమూర్తిరాజు నామినేషన్లు దాఖలు చేశారు. ఇరుపార్టీలకు సమానంగా వార్డు మెంబర్లు ఉండడంతో సర్పంచ్ జమ్ము పార్వతి ఓటుతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గురమ్మ ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అన్నపూర్ణాదేవి ప్రకటించారు. ఉపసర్పంచ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము స్వామి నాయుడు, జమ్ము సత్యనారాయణ, జమ్ము లచ్చన్న శుభాకాంక్షలు తెలిపారు.

శ్యామాయవలస ఉపసర్పంచ్‌గా శ్రీదేవి

మెరకముడిదాం: శ్యామాయవలస పంచాయతీ ఉపసర్పంచ్‌గా 2వ వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ మద్దతు దారు బొత్స శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శ్రీదేవికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.వి.ఎస్.సుదర్శన్ పట్నాయక్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఉపసర్పంచ్‌కు సర్పంచ్ రెడ్డి శాంతి, వార్డుమెంబర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జి.బి.వి.రమణ అన్నారు. ఎస్‌బీఐ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బుడతానపల్లి గ్రామంలో అగరబ త్తీల తయారీపై శిక్షణపూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి అవకాశాలతో మహిళలు వారి కాళ్లపై వారు నిలబడాలనే ఉద్దేశంతో శిక్షణ ఇప్పించామన్నారు. ప్రగతి ఉద్యాన కేంద్రం ప్రతినిధి బుద్దరాజు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. – గంట్యాడ

వైద్య సిబ్బందికి సన్మానం



ఉత్తమ వైద్య సిబ్బందిగా ఎంపికై ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వియ్యంపేట పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ లోగిస సత్యారావు, ఎల్‌టీ సంతోష్ డీఎంహెచ్ఓ జీవనరాణి, జిల్లా టీబీ అధికారి రాణి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరిని వియ్యంపేట పీహెచ్‌సీలో వైద్యాధికారి గోపాలకృష్ణ, ఇతర వైద్యసిబ్బంది గురువారం సన్మానించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఏ ఉద్యోగికైనా చేసిన సేవలే గుర్తింపునిస్తాయని అన్నారు. – కొత్తవలస

సారా నిర్మూలిద్దాం...



జీవితాలను, ఆరోగ్యాన్ని నాశనం చేసే సారా నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఏ.ఎస్.దొర కోరారు. నవోదయం 2.0లొ భాగంగా కొత్తవలస ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.రాజశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో కుమ్మపల్లిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ దొర మాట్లాడుతూ సారా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. సారాతో పట్టుబడితే కేసు నమోదు చేయడంతో పాటు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారుచేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సారా నిర్మూలనకు అంతా కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ అరుణ, తదితరులు పాల్గొన్నారు – వేపాడ

రూ.4.80 లక్షల విలువైన సామగ్రి వితరణ



పాఠశాలకు అందించిన సామగ్రిని ప్రారంభిస్తున్న ఎంపీపీ గోపమ్మ,అడమా కంపెనీ ప్రతినిధులు

కొత్తవలస: నిమ్మలపాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా అడమా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌సంస్థ వారు రూ.4.80 లక్షల విలువైన 25 బెంచీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, ఎల్ఈడీ స్మార్ట్ ప్యానల్, సౌండ్‌బాక్స్‌లు, స్పోర్ట్స్ కిట్లు తదితర సామగ్రిని అందజేశారు. వీటిని ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ గురువారం ప్రారంభించారు. అడమా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ ఇండియా సేల్స్ హెడ్ గొంప బాపునాయుడుకు ఎంపీపీతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచ్ కొట్యాడ నిర్మలాసాయి, మాజీ సర్పంచ్ గొంప సత్యవతి, హెచ్ఎం పార్వతి, అడమా కంపెనీ ప్రతినిధులు అమర్నాథ్‌రెడ్డి, లక్ష్మణరావు, ముస్తఫా, దినేష్, గ్రామపెద్దలు కొట్యాడ శ్రీనివాసరావు, గొంప పోతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సీఐ జి.ఏ.వి.రమణ, ఎస్ఐ లక్ష్మణరావును సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం పెద్దలు

గజపతినగరం: చదువుకున్న వారు, ఉద్యోగస్తులు సైతం సైబర్ నేరగాళ్ల బారినపడి లక్షల రూపాయలను పోగొట్టుకుంటున్నారని, సైబర్ నేరాల పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ సూచించారు. స్థానిక శ్రీవాసవీ కల్యాణ మండపంలో ప్రపంచ ఆర్యవైశ్య మహా సభ జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్ర మం నిర్వహించారు. అతిథిగా హాజరైన సీఐ సైబర్ నేరాలపై అవగాహన కల్పించా రు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లకు పంపించే లింకులపై క్లిక్ చేయవద్దన్నారు.ఫోన్‌పే ద్వారా లావాదేవీలు చేసేవారు డబుల్ లాక్ వేసుకుంటే మంచిదని సూచించారు. సాధ్యమైనంత వరకు షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అనంతరం నిరుపేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. సీఐతో పాటు ఎస్ఐ కె.లక్ష్మణరావును ఆర్యవైశ్య సంఘ పెద్దలు సన్మానించారు. ఏపీ వైశ్యకార్పొరేషన్ డైరెక్టర్ కె.సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు కె.సాంబమూర్తి, ఉప్పల ఈశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.